


జైళ్లలోనూ.. ఏఐ నిఘా..!

- అక్రమాలకు చెక్ పెట్టడమే లక్ష్యం
- ప్రయోగాత్మకంగా పరప్పన అగ్రహారలో అమలుకు నిర్ణయం





పరప్పన అగ్రహార జైలు

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంలో కీలకంగా ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) అన్ని విభాగాలలో తన సత్తా చాటుకుంటోంది. బెంగళూరు సహా రాష్ట్రంలో ఏఐ విధానాన్ని ప్రధానంగా ట్రాఫిక్ కెమెరాలకు వినియోగించారు. తద్వారా సిగ్నల్ ఉల్లంఘన, ఓవర్‌స్పీడ్, హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్టు లేకపోవడం వంటి వాటిని ఈ అత్యాధునిక కెమెరాలు గుర్తిస్తున్నాయి. తాజాగా ఏఐ సాంకేతికతను జైళ్లశాఖ కూడా వినియోగించుకోదలిచింది. సాధారణంగా నేరస్తులను జైళ్లకు పంపడం సామాన్యం. జైళ్లు పరివర్తనా కేంద్రాలుగా భావిస్తారు. అయితే ఇక్కడ కూడా డ్రగ్స్ వంటి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో సంస్కరణకు చర్యలు చేపట్టదలిచారు. రాష్ట్రంలో 9 సెంట్రల్ జైళ్లు, 21 జిల్లా జైళ్లు, 23 తాలూకా జైళ్లు, ఒక ఓపెన్ ఎయిర్ జైలు మొత్తం 54 జైళ్లు ఉన్నాయి. వీటిలో అత్యంత పెద్దది బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైలు. గరిష్ఠంగా 5వేలమంది ఖైదీలకు అవకాశం ఉంది. 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ జైలులో మహిళలు, పురుషులకు వేర్వేరు బ్యారెక్‌లు ఉన్నాయి. శిక్ష పడినవారు, అండర్ ట్రయల్స్ కేసులు ఎదుర్కొంటున్నవారు 4వేలమందికిపైగానే ఇక్కడ ఉన్నారు. జైళ్లలో అక్రమాలకు చెక్ పెట్టేలా ఏఐ కెమెరా వ్యవస్థ అమలు చేయాలని రాష్ట్ర జైళ్లు, సంస్కరణలశాఖ నిర్ధారించింది.

● రూ.2 కోట్లతో ఏఐ కెమెరాలు

పరప్పన అగ్రహార జైలులో రూ.2కోట్లతో ఏఐ కెమెరాలను అమర్చనున్నారు. దశలవారీగా ఇతర జైళ్లలో కూడా విస్తరించనున్నారు. రాష్ట్రంలోని సెంట్రల్ జైళ్లలో మొత్తం 280 కెమెరాలు అమర్చనున్నట్టు సమాచారం. 8 నెలలక్రితం చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో నటుడు దర్శన్, ఇతర సహచరులకు జైళ్లలో ప్రత్యేక సౌకర్యాలు కల్పించారంటూ బహిరంగ విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలో విమర్శలు, అక్రమాలకు చెక్ పెట్టేలా అత్యాధునిక ఏఐ కెమెరాలను వినియోగించదలిచారు. ఈ కెమెరాల ద్వారా జైళ్లలోని విచారణ ఖైదీలు, శిక్షకు గురైన ఖైదీలను ఎవరెవరు భేటీ అవుతున్నారు, మొబైల్ వాడకం, ఇతరత్రా అంశాలు ఎప్పటికప్పుడు గమనించే వీలుందని, క్రిమినల్ ఖైదీల సమాచారాన్ని, దృశ్యాలను అవసరమైన దర్యాప్తు అధికారులతో పంచుకునేందుకు వీలవుతుందని జైళ్లశాఖ దక్షిణ విభాగం డీఐజీ దివ్యశ్రీ అభిప్రాయపడ్డారు.

● ఖైదీలు బ్యారక్ దాటితే సమాచారం

జైళ్లలో ఖైదీలు నిబంధనలు ఉల్లంఘించకుండా ఉండేలా నిఘా వ్యవస్థలో భాగంగా ఏఐ కెమెరాలు పనిచేయనున్నాయి. ఖైదీల ప్రతి కదలిక ఇందులో రికార్డు అవుతుంది. జైలులోని కెమెరాల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక గదిని కేటాయించనున్నట్టు దివ్యశ్రీ తెలిపారు. ఈ నియంత్రణా విభాగంలో అన్ని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. ఖైదీలు తమ బ్యారక్ నుంచి మరొక బ్యారక్ వెళ్తే వెంటనే ఏఐ కెమెరాలు సమాచారం ఇస్తాయన్నారు. అంతేకాక విచారణ ఖైదీలు, శిక్షపడిన ఖైదీలు ఎవరెవరు భేటీ అవుతున్నారనేది రికార్డు అవుతుందన్నారు. 3-6 నెలలపాటు ఈ డేటా స్టోరేజ్ సాధ్యమన్నారు. పరప్పన అగ్రహార జైలులో ప్రస్తుతం ఉన్న పాత కెమెరాల స్థానంలో ఏఐ కెమెరాలను మార్చనున్నామన్నారు.

● వివాదాలకు నెలవు...

పరప్పన అగ్రహార జైలుకు సాధారణ నిందితులే కాకుండా సినిమా నటులు, రాజకీయ నాయకులు కూడా ఖైదీలుగా వచ్చినవారే. మాదకద్రవ్యాలు, అనుమతి లేకున్నా మొబైల్ వాడకం, ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీల వేళ భారీగా మొబైళ్లు, డ్రగ్స్ వంటివి బహిరంగం కావడంతో జాతీయస్థాయిలో విమర్శలు వచ్చాయి. వీటికి చెక్ పెట్టేలా అత్యాధునిక విధానాలు అమలు చేయదలిచారు.

● మూడుగా విభజించి ప్రత్యేక ప్రక్రియ

బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో అక్రమాలు అధికమయ్యాయనే ఆరోపణల నేపథ్యంలో దీన్ని 3 విభాగాలుగా విభజించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జైలులో ప్రత్యేకవిభాగాల ఏర్పాటుకు సంబంధించి జైళ్లు, సంస్కరణలశాఖ డీజీపీ మాలిని కృష్ణమూర్తి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ నేపథ్యంలో శిక్ష పడినవారు, అండర్ ట్రయల్స్, మహిళా ఖైదీలుగా విభజించదలిచారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ సాగుతోంది. శిక్షణ పడిన ఖైదీలు, అండర్ ట్రయల్స్ ఉండే ఖైదీల విభాగానికి మధ్య భారీ గోడ నిర్మించదలిచారు.

● 400మంది సిబ్బంది కాపలా

ప్రస్తుతం పరప్పన అగ్రహారజైలులో మొత్తం 4800 మంది ఖైదీలు ఉన్నట్టు సమాచారం. జైలు సూపరింటెండెంట్, ఇతర అధికారులు, సిబ్బంమొత్తం 800మంది పోస్టులు మంజూరు కాగా అందులో సగం అంటే సుమారు 400మంది సిబ్బంది కాపలాగా ఉన్నారు. మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్త జైలుకు వంట గది, ఆసుపత్రి, సందర్శకుల విభాగం వంటి ప్రత్యేకంగా ఏర్పాటు కానున్నాయి.



భరత్ భూషణ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మునిరత్న

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

- ఫోన్‌లో పరామర్శించిన సీఎం

బెంగళూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్ము-కశ్మీర్ ఉగ్ర దాడిలో మృతి చెందిన భరత్‌భూషణ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మునిరత్న పరామర్శించారు. రాజరాజేశ్వరినగర్ నియోజకవర్గం 17వ వార్డు జేపీపార్కు సుందరనగర్‌లో భరత్‌భూషణ్ కుటుంబం ఉంటోంది. ఇతడి సొంత ప్రాంతం హావేరి జిల్లా రాణిబెన్నూరు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసిన భరత్‌భూషణ్ (41) కొంతకాలంగా సొంతంగా డయాగ్నస్టిక్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. భార్య సుజాత, మూడేళ్ల కొడుకుతో కలసి ఈనెల 18న కశ్మీర్ పర్యటనకు వెళ్లారు. పహల్గాంలో దుండగుల దాడిలో భరత్‌భూషణ్ మృత్యువాత చెందాడు. భరత్‌భూషణ్ మృతి పట్ల ఎమ్మెల్యే మునిరత్న తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. భరత్ భూషణ్ భార్య, కుమారుడు క్షేమంగా బయటపడ్డారని వారిని సాధ్యమైనంత త్వరగా బెంగళూరుకు రప్పిస్తామన్నారు. బుధవారం భరత్‌భూషణ్ కుటుంబీకులను పరామర్శించారు. కాగా బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య కూడా కశ్మీర్ ఘటనపై విషాదం వ్యక్తం చేశారు.

ఫోన్‌లో పరామర్శించిన సీఎం

ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన శివమొగ్గ మంజునాథ, బెంగళూరు భరత్ భూషణ్‌ల కుటుంబాలను సీఎం సిద్దరామయ్య ఫోన్‌లో పరామర్శించారు. మంజునాథ భార్య పల్లవి, భరత్‌భూషణ్ భార్య సుజాతలకు ఫోన్ చేసి సాంత్వన పలికారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కాగా బాధను భరించేశక్తి ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.

పర్యాటకులకు మంత్రి భరోసా



కొప్పళకు చెందిన పర్యాటకులతో మంత్రి సంతోష్‌లాడ్..

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీనగర్ పర్యటనకు వెళ్ళిన కొప్పళ పట్టణానికి చెందిన నాలుగు కుటుంబ సభ్యులను కార్మిక శాఖామంత్రి సంతోష్ లాడ్ బుధవారం కలిసి ధైర్యాన్ని నింపారు. ఎక్కడికీ వెళ్లకుండా హోటల్లో జాగ్రత్తగా ఉండాని సూచించారు. వీరిలో సిద్దు గణవారి, పారిశ్రామిక వేత్త శరణప్ప సజ్జన్, కాంగ్రెస్ ప్రముఖులు కాటన్ పాషా, శివకుమార పావలి శెట్టర్ కుటుంబ సభ్యులతో బుధవారం శ్రీనగర్‌కు వెళ్ళి వారిని పరామర్శించారు. పర్యటను రద్దుచేసుకుని బుధవారం సాయంత్రానికి ఢిల్లీకి రావాలని నిర్ణయించారు.

ఉగ్రదాడికి తగిన చర్యలు తప్పవు

- ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ



బెంగళూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడి ఘటనలో పర్యాటకులు మృతి చెందగా పలువురు గాయపడ్డారని, భారత్ వారికి తగినబుద్ధి చెబుతుందని చాముండేశ్వరి నియోజకవర్గ ఎమ్మెల్యే జీటీ దేవేగౌడ అభిప్రాయపడ్డారు. మైసూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి హేయమైనదన్నారు. దీన్ని సహించేది లేదన్నారు. ఇద్దరు కన్నడిగులు మృతి చెందగా పలువురు అక్కడే చిక్కుకున్నారన్నారు. జమ్ము-కశ్మీర్‌లో ఎన్నికలు జరిగాక ఒమర్ అబ్దుల్లా సీఎం అయ్యారని, లక్షలాదిమంది నిత్యం కశ్మీర్‌ను సందర్శిస్తుంటారన్నారు. ఉగ్రవాద దాడిని కన్నడిగులందరూ ఖండిస్తున్నారన్నారు. కుమారుడి ఎదుటే శివమొగ్గ మంజునాథ్‌ను హతమార్చారని విచారం వ్యక్తం చేశారు. హిందువులను టార్గెట్‌గా దాడి చేశారని ఇందుకు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలు తగిన బదులు ఇస్తారన్న విశ్వాసం వ్యక్తం చేశారు. కాగా ఇండియన్ మిలిటరీ మైసూరు చాముండేశ్వరి దేవి ఆశీర్వాదం ఉంటుందని ఉగ్రవాదులను హతమారుస్తారన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ అంశంలో అందరూ సమైక్యంగా పోరాటం చేయాలన్నారు.

ఇండియా-తైవాన్ దేశాల సత్సంబంధాలపై చర్చాగోష్ఠి



వేదికపై భారత్, తైవాన్ దేశ ప్రతినిధులు

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ రేవా విశ్వవిద్యాలయంలో రేవా విశ్వసంవాద-2025 పేరిట భారత్, తైవాన్ దేశాల మధ్య గ్లోబల్ అంశాలపై ప్రత్యేక చర్చాగోష్ఠి జరిగింది. ఇండియా-తైవాన్ డైలాగ్ ఎక్స్‌ప్లోరింగ్ విస్పాస్ ఫర్ కో-ఆపరేటివ్ అజెండాస్ అనే నినాదంతో కార్యక్రమం సాగింది. రేవా యూనివర్సిటీ, తైవాన్ దేశం తైపేన్‌లోని ప్రాస్పెక్ట్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్లోబల్‌స్థాయి చర్చాగోష్ఠి ఏర్పాటైంది. చర్చాగోష్ఠికి నేతృత్వం వహించిన రేవా వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పి శ్యామరాజు మాట్లాడుతూ పలు పాలసీల విషయంలో విద్యాసంస్థలు, యూనివర్సిటీలు కీలకపాత్ర వహిస్తున్నాయన్నారు. రెండు దేశాలమధ్య వారధిగా ఉన్నాయన్న విశ్వాసం వ్యక్తం చేశారు. రెండు బలమైన ప్రజాస్వామ్యదేశాలకు చెందిన విద్యానిపుణులు, పాలసీ రూపకర్తలు వారి అభిప్రాయాలు పంచుకోవడానికి వేదికగా మారిందన్నారు. రెండురోజుల చర్చాగోష్ఠిలో ప్రముఖ జాతీయసమస్యలు, వివిధ రంగాల అంశాల సమస్యలకు పరిష్కారాలు చర్చించే వీలు కలిగిందన్నారు. తైవాన్ కమిషన్‌కు నేతృత్వం వహిస్తున్న ప్రాస్పెక్ట్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ ఐ - చుంగ్‌లై మాట్లాడుతూ భారత్, తైవాన్ దేశాల మధ్య సంబంధాలు బలపడేందుకు ఈ చర్చాగోష్ఠి ఉపకరిస్తుందన్నారు. సాంకేతికరంగంలో భారత్ గణనీయమైన ప్రాబల్యం కలిగి గ్లోబల్‌స్థాయిలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. తైవాన్ దేశం తైపేయన్‌లోని భారత్ - తైపేయ్ అసోసియేషన్ జనరల్ డైరెక్టర్, ఐఎఫ్ఎస్ అధికారి మన్‌హర్‌సింగ్ యాదవ్ మాట్లాడుతూ ఐటీ, సెమికండక్టర్, సప్లయ్ చైయిన్, డ్రోన్ టెక్నాలజీ, ఏఐ స్టార్టప్ వంటి రంగాలలో భారత్, తైవాన్ దేశాల సంబంధాలు మరింత బలపడి ముందుకు సాగేందుకు రేవా యూనివర్సిటీ చొరవపై హర్షం వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాల మధ్య విద్యార్థుల వినిమయం, పరిశోధనలు మరింత పెరగాలన్నారు. రేవా యూనివర్సిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ జియో పాలిటిక్స్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ అడ్వైజర్, ప్రొఫెసర్ డాక్టర్ మాధవదాస్ నలపత్ మాట్లాడుతూ ఐటీ రంగంలో భారత్, హార్డ్‌వేర్ రంగంలో తైవాన్ దే శాలు ప్రబలంగా ఉన్నాయని రెండు దేశాలమధ్య సౌహార్ద్ర సంబంధాలు మెరుగు కావాలన్నారు. రేవా యూనివర్సిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ జియోపాలిటిక్స్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ ముఖ్యులు డాక్టర్ విజయ్ సకుజా రచించిన కోల్డ్‌వార్ 2.0 ఇన్ ఇండియా పుస్తకాన్ని ఆవిష్కరించారు. భారత్, తైవాన్ దేశాల సంస్థల సభ్యులు, వర్సిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఫ్రీడంపార్కులో దివిటీల ప్రదర్శన

ఉగ్రదాడులకు నిరసనగా ర్యాలీలు

బెంగళూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ ఉగ్రవాద సంఘటనను ఖండిస్తూ నగరంలో బుధవారం వివిధ సంస్థలు నిరసన ర్యాలీలు నిర్వహించాయి. నగరంలోని ఫ్రీడంపార్కులో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మంజునాథ్‌గౌడ ఆధ్వర్యంలో సాయంత్రం దివిటీల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాద దాడులలో మృతి చెందినవారి ఆత్మకు శాంతి లభించాలని కోరుతూ ర్యాలీ సాగింది. కాగా హిందు జాగరణ వేదిక ఆధ్వర్యంలో మల్లేశ్వరం ఐదోక్రాస్ కువెంపు సర్కిల్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. హిందూసంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కాగా బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటైన ర్యాలీలో తొలుత మృతి చెందిన భరత్‌భూషణ్, మంజునాథరావ్‌ల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. ప్రతిపక్షనేత ఆర్ అశోక్, ఎంపీ పీసీ మోహన్, ఎమ్మెల్సీ సీటీ రవి తదితరులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో కార్యకర్తలు దివిటీల ప్రదర్శనలో పాల్గొన్నారు.



బీజేపీ ఆధ్వర్యంలో ప్రదర్శన



మల్లేశ్వరంలో కొవ్వొత్తులు, ప్లకార్డులతో ర్యాలీ

యూపీఎస్‌సీ విజేతలు వీరే...



తల్లిదండ్రులతో కోలారు జిల్లాకు చెందిన డాక్టర్ మాధవి



పాండురంగ



డాక్టర్ మహేశ్



రాహుల్ యరంతేలి

బెంగళూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మంగళవారం ప్రకటించిన ఫలితాల్లో రాష్ట్రం నుంచి 30మందికిపైగా విజయం సాధించారు. బెంగళూరుకు చెందిన డాక్టర్ రంగ మంజు జాతీయస్థాయిలో 24వ ర్యాంకు సాధించగా స్టేట్‌లెవెల్‌లో టాపర్‌గా నిలిచారు. హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకా కోడియాల హొసపేటకు చెందిన డాక్టర్ సచిన్ బసవరాజ గుత్తూరు 41 ర్యాంకు సాధించారు. వరుసగా నాల్గో ప్రయత్నంలో విజయం సాధించారు. కోలారు తాలూకా ఇరగసంద్ర గ్రామానికి చెందిన ఏ మధు 544 ర్యాంకు సాధించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆనందగౌడ, సుశీలమ్మ దంపతుల కుమారుడు మధు. బీఎస్సీ అగ్రికల్చర్ చేసి ఎలాంటి కోచింగ్ లేకుండా ఐదో ప్రయత్నంలో విజయం సాధించారు. దివంగత ఐఏఎస్ అధికారి డీకే రవి సేవలతో స్ఫూర్తి చెంది ఐఏఎస్‌కు సిద్ధమైనట్టు మధు తెలిపారు. ఎట్టకేలకు కలను సాకారం చేసుకున్న మధును స్థానికులు ప్రశంసించారు. కాగా దావణగెరె జిల్లా చన్నగిరి తాలూకా మాదేనహళ్ళికి చెందిన డాక్టర్ దయానందసాగర్ సైకాలజీ డాక్టర్‌గా ఉన్నారు. యూపీఎస్‌సీలో తొలి ప్రయత్నంలో 615వ ర్యాంకు సాధించారు. బాగల్కోటె జిల్లా ముధోళ ప్రాంతానికి చెందిన రైతు కుమారుడు పాండురంగ సదాశివ కంబళి యూపీఎస్సీలో 529వ ర్యాంకు సాధించారు. బెంగళూరు ఆర్‌వీ కాలేజీలో ఇంజనీరింగ్ చదివిన పాండురంగ ఐదుసార్లు ప్రిలిమ్స్ పాస్ అయి మూడుసార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. ఢిల్లీలో కోచింగ్ పొందారు.

కన్నడ మీడియంలో పరీక్ష రాసి యూపీఎస్‌సీలో 462వ ర్యాంకు సాధించారు డాక్టర్ మహేశ్ మడివాళ. విజయపుర జిల్లా తాళికోటె తాలూకా మడికేశ్వర గ్రామంలోని పీహెచ్‌సీలో పాలనా వైద్యాధికారిగా కొనసాగుతున్నారు. వరుసగా నాలుగుసార్లు విఫలమైనా నిరాశ చెందకుండా కష్టపడి ఐదో ప్రయత్నంలో విజయం సాధించారు. కోలారు జిల్లా శ్రీనివాసపురకు చెందిన డాక్టర్ మాధవి యూపీఎస్సీలో 446వర్యాంకు సాధించారు. రాజాజినగర్ ఈఎస్ఐ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదివిన ఈమె యూపీఎస్సీ కోసం ఆన్‌లైన్ కోచింగ్ తీసుకున్నారు. ముతకపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ ఆర్ రవికుమార్, లక్ష్మీసాగరలో ప్రభుత్వ టీచర్ నందిని దంపతుల కుమార్తె మాధవి. కాగా తహసీల్దార్‌గా రిటైరైన పెదనాన్న శ్రీనివాస్‌ను ఆదర్శంగా తీసుకుని యూపీఎస్సీకి సిద్ధమయ్యారు. వరుసగా ఐదుసార్లు ఫెయిల్ అయినా నిరాశ చెందకుండా ఆరో ప్రయత్నంలో 462వ ర్యాంకు సాధించారు రాహుల్ యరంతేలి. విజయపుర జిల్లా బసవనబాగేవాడికి చెందిన ఇతను రోజూ 8-10 గంటలు చదివేవాడు. బెంగళూరు డాక్టర్ రాజ్‌కుమార్ అకాడమీలో ఒక సంవత్సరం కోచింగ్ పొందారు. బెంగళూరు లైబ్రరీలో పలు పుస్తకాలను అధ్యయనం చేశారు.



ఉత్తుత్తి ఆత్మరక్షణ షో ఇస్తున్న కోచ్‌లు (ఫైల్)

ఆత్మరక్షణ పేరుతో నిధుల భక్షణ

అనంతపురం కలెక్టరేట్‌లో సంతకాల ఫోర్జరీపై చర్చిస్తున్న రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఏజెన్సీ నిర్వాహకులు





నీరుగారుతున్న కేంద్ర పథకం
రూ.కోటిపై కన్ను

- రెండు జిల్లాల్లోనూ నిధులకు ఎసరు
- ఫోర్జరీ సంతకాలతో తప్పుడు హాజరు నమోదు
- వైసీపీ హయాంలో రూ.5 కోట్లు హాంఫట్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బాలికలపై పెరుగుతున్న దాడుల నుంచి ఆత్మరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రవేశపెట్టిన పథకం నిర్వీర్యమవుతోంది. ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల్లో మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించి ఆపదలో తనను తాను రక్షించుకోవడానికి ఆత్మరక్షణ కళలపై శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 'రాణి లక్ష్మీబాయ్ ఆత్మ రక్ష ప్రసిక్షణ్' పేరిట ఈ పథకాన్ని తీసుకువచ్చారు. ఇందుకు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు రూ.50 లక్షల చొప్పున మొత్తం రూ.కోటి నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో ఎన్నడూ పేరు కూడా వినని హైదరాబాద్‌కు చెందిన రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఏజెన్సీకి అనంతపురం, విజయవాడకు చెందిన రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీకి శ్రీసత్యసాయి జిల్లాల్లో ఆత్మరక్షణ కళల శిక్షణ బాధ్యతను కట్టబెట్టారు. ఇప్పటికే రెండు జిల్లాలకు చెరో రూ.14లక్షల చొప్పున రూ.28లక్షలు నిధులు కూడా మంజూరు చేశారు. మొదట ఒక్కో జిల్లాలో 167 మంది కోచ్‌లతో శిక్షణ ప్రారంభిస్తామని చెప్పిన ఏజెన్సీ నిర్వాహకులు నైపుణ్యత, అనుభవం లేని స్థానిక కోచ్‌లతో ఉత్తుత్తి శిక్షణ ప్రారంభించారు. అనంతపురం జిల్లాలో 495 ప్రభుత్వ పాఠశాలల్లో 48 వేల మంది బాలికలకు, శ్రీసత్యసాయి జిల్లాలో 480 పాఠశాలల్లో 45వేల మంది బాలికలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఒప్పందం చేసుకుని మూడునెలలు కావస్తున్నా ఇప్పటి వరకు సగానికి పైగా స్కూళ్లల్లో ప్రారంభానికి నోచుకోలేకపోయింది. ప్రతి పాఠశాలలో కనీసం 20 క్లాస్‌లు నిర్వహించాల్సి ఉంది. ఉత్తుత్తి శిక్షణ ప్రారంభించిన స్కూళ్లలో కూడా పది తరగతులు నిర్వహించలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఏడాదికి రూ.కోటి చొప్పున రూ.5 కోట్లు ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే నిధులను హాంఫట్ చేసేశారు.

ఫోర్జరీ సంతకాలతో హాజరు నమోదు

బాలికలకు ఆత్మరక్షణ కళల శిక్షణకు సంబంధించి ఫోర్జరీ సంతకాలతో తప్పుడు హాజరు నమోదు చేయడం వివాదంగా మారింది. అనంతపురం కేంద్రంగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఆత్మరక్షణ కళల పథకం నడిపిస్తున్నారు. కలెక్టరేట్లో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఏజెన్సీ ప్రతినిధులు ఆయా పాఠశాలలు, ఆయా మండలాల ఎంఈఓల సంతకాలను ఫోర్జరీ చేస్తున్న ఓ వీడియో వైరల్‌గా మారింది. చాలా పాఠశాలల్లో శిక్షణ ప్రారంభించకనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. మార్చి 3 నుంచి 27వతేదీ వరకు శిక్షణ నిర్వహించాల్సి ఉంది. కోచ్‌లు లేక శిక్షణ ప్రారంభించలేదు. మొత్తానికి విద్యా సంవత్సరం పూర్తయిపోతోంది. శిక్షణ ఇవ్వకుండానే నిధులు కాజేసేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. రూ.కోటి నిధులు బూడిదలో పోసిన పన్నీరుగానే నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ఒప్పందం ప్రకారం 167మంది కోచ్‌లతో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఎలాంటి నైపుణ్యంలేని 20 మంది స్థానిక ఉత్తుత్తి కోచ్‌లతోనే శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో 975 ప్రభుత్వ పాఠశాలలకు గాను 400 స్కూళ్లలో మాత్రమే నామమాత్రంగా ప్రారంభించారు. ఇందులోనూ వంద స్కూళ్లలో పది తరగతులు కూడా నిర్వహించకపోవడం గమనార్హం.

ఆలస్యమైన మాట వాస్తవమే

కొన్ని అడ్డంకులతో బాలికలకు ఆత్మరక్షణ కళల శిక్షణ ఆలస్యమైన మాట వాస్తవమే. బాలికలకు ఉపయోగకరంగా ఉండేలా ఆత్మరక్షణ కళలపై శిక్షణ ఇస్తున్నాం. నిష్ణాతులైన కోచ్‌లు ఇందుకు అవసరమైన శిక్షణ, సాధన చేయిస్తున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే నిర్వహించాల్సిన శిక్షణలు ఆలస్యంగా ప్రారంభించాం. ప్రతి పాఠశాలలో కనీసం 20 తరగతులు కచ్చితంగా శిక్షణ ఇవ్వాల్సి ఉంది. శిక్షణకు సంబంధించి ఏజెన్సీతో బాండ్‌పైన రాయించుకున్నాం. ప్రతి అంశం ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ప్రతి తరగతి, ప్రతి పైసాకు లెక్క చెప్పాల్సిందే.

- శైలజ, దేవరాజ్, ఏపీసీలు, సమగ్రశిక్ష, అనంతపురం, శ్రీసత్యసాయి

ఆత్మరక్షణ కళలతో ఉపయోగం



ఆత్మరక్షణ కళలు బాలికలకు ఎంతో ఉపయోగకరం. మంచి లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. ఆత్మరక్షణ కళలు తమను తాము రక్షించుకోవడానికి ఉపకరిస్తాయి. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు పూర్తి స్థాయిలో నైపుణ్యంగల కోచ్‌ల ద్వారా శిక్షణ ఇస్తే ఉపయోగం ఉంటుంది. ఈ పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేయాలి. క్రీడా శాఖ నుంచి మా వంతు సహకారం అందిస్తాం.

- ఉదయ్‌భాస్కర్, డీఎస్‌డీఓ



మొక్కతొడిగిన మోసం

నాసిరకం మొక్కలు అంటగడుతున్న నర్సరీ నిర్వాహకులు

- అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్వహణ
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం
- సాగు సమయంలో గుర్తించలేక నష్టపోతున్న రైతులు



నర్సరీలో పెంచుతున్న టమోటా మొక్కలు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఏడంతా ఏడిపించినా ఒక్కసారి పంట తగులుకుంటే చాలు తమ భాగ్యరేఖ మారుతుందని నమ్మి అనేక మంది రైతులు టమోటా పంటను సాగు చేస్తున్నారు. వీరు మొక్కల కోసం నర్సరీలపై ఆధారపడుతున్నారు. ఇదే అవకాశంగా కొందరు నర్సరీల నిర్వాహకులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి అధిక రేట్లు, నాసిరకం మొక్కలు అంటగడుతూ రైతులను దగా చేస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 200 పైబడి నర్సరీలు ఉన్నాయి. నర్సరీ నుంచి నాణ్యమైన ఉద్యాన మొక్కలను మాత్రమే రైతులకు అందించాలి. సిఫారసు చేసిన ఉద్యాన పంటల రకాల మొక్కలను మాత్రమే పెంచాలి. మొక్కపేరు, మూలాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలి. పురుగులు, తెగుళ్ల సోకని మొక్కలను రైతులకు సరఫరా చేయాలి. ఐదేళ్లలో జరిగిన మొక్కల అమ్మకాల వివరాలను యాజమాన్యం రికార్డు చేయాలి. మొక్కలను ఎక్కడి నుంచి తెచ్చారు, వాటి ధరలను బోర్డులపై ఉంచాలి. ప్రభుత్వం నుంచి తప్పకుండా లైసెన్సు పొంది ఉండాలి. ఇలాంటి నిబంధనలు ఇక్కడ ఏమాత్రం పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కనిపించని ఉద్యానశాఖ అధికారులు

నాణ్యమైన మొక్కల పెంపకం కోసం రాష్ట్ర ప్రభుత్వం 2012లో ఉద్యాన పంటల నర్సరీల చట్టాన్ని రూపొందించింది. అనుమతులు లేకుండా నర్సరీలను నిర్వహించరాదని, అలా చేస్తే అధికారులు చర్యలు తీసుకునేలా జీవో నంబర్ 211ను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే నియోజకవర్గంలో చాలా చోట్ల అనుమతులు లేకుండానే నర్సరీలను నిర్వహిస్తున్నారు. అయినా అధికారులు ఏమాత్రమ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. దీంతో నిర్వాహకులు నాసిరకం మొక్కలను రైతులకు అంటగడుతున్నారు. ఈ విషయమై రైతులు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. నర్సరీల నుంచి మొక్క తెచ్చినపుడు అసలుకు, నాసిరకానికి ఏమాత్రం తేడా ఉండదు. పైరుగాని, మొక్కగాని ఎదిగే క్రమంలో రైతులు తేడాను గుర్తిస్తారు. అయితే అప్పటికే రైతు పెట్టుబడుల రూపంలో వేలాది రూపాయలు ఖర్చు చేసి ఉంటారు. దీంతో పంట పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎవరైనా రైతులు గొడవకు దిగి తే రాజకీయ పార్టీల నాయకుల అండతో దువ్వటి పంచాయతీ చేస్తున్నారు. అంతో ఇంతో మట్టుజెప్పి సమస్యను సద్దుమణిగిస్తున్నారు.



కర్ణాటకకు పరుగులు

కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, కళ్యాణదుర్గం మండలాల పరిధిలో నాసిరకం టమోటా నారును రైతులకు అంటగడుతున్నారు. విసిగిపోయిన రైతులు నాణ్యమైన టమోటా మొక్కల కోసం కర్ణాటక ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. చెళ్లకెర, పావగడ ప్రాంతాలకు వెళ్లి ట మోటా, మిరప మొక్కలను ఎక్కువగా తీసుకొస్తున్నారు. అక్కడ మొక్కల్లో నాణ్యతా ప్రమాణాలు బాగుండటంతో చాలా మంది కర్ణాటక బాట పడుతున్నారు.



కుందుర్పి మండలంలో నర్సరీలకు తనిఖీకి వెళ్లి టమోటా మొక్కను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి నరసింహారావు, ఉద్యానశాఖాధికారి గౌసియామీ (ఫైల్)

50 నర్సరీలకే అనుమతి

నియోజకవర్గంలో దాదాపు 50 నర్సరీలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. అయితే దాదాపు 200 నర్సరీలను నిర్వహిస్తున్నట్లు తెలిసింది. వీటిలో ఏ నర్సరీలోను నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. జిల్లా ఉద్యానశాఖాధికారులు కూడా నర్సరీల నిర్వాహణపై తనిఖీలు చేశారే కాని, పూర్తి స్థాయిలో నిబంధనలు అమలు జరిగేటట్లు చూడలేదు. టమోటా సాగు లాభసాటిగా ఉండటంతో రైతులు ఎక్కువ మంది పంట సాగుకు మొగ్గు చూపుతారు. దీన్ని ఆసరాగా చేసుకుని నర్సరీలు పుట్టగొడుగులా వెలిశాయి.

పంట ఎదుగుదల లేదు



నాకున్న మూడెకరాల్లో ఎకరాల్లో టమోటా సాగు చేశా. అయితే ఎన్ని మందులు పిచికారీ చేసినా పంట ఎదుగుదల లేదు. తోటి రైతులు పంటను పరిశీలించి నాసిరకంగా మొక్కలని తేల్చారు. ఈక్రమంలో పెట్టుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోయా. నర్సరీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.

- బొమ్మయ్య, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

ఐదెకరాల్లో నష్టపోయా



నాకున్న ఐదెకరాల పొలంలో విడతల వారీగా టమోటా సాగు చేశా. మొక్కలు కుందుర్పి మండలంలోని ఓ నర్సరీ నుంచి తెచ్చా. అవి నాసిరకం కావడంతో పంట ఏమాత్రం దిగుబడి రాలేదు. దీం తో పూర్తిగా నష్టపోయా. ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బందులు పడ్డాం. - రామాంజనేయులు, కరిగానిపల్లి

నోటీసులు ఇస్తున్నాం

అనుమతులు లేని నర్సరీలకు నోటీసులు జారీ చేస్తున్నాం. కొన్ని నర్సరీలకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. విచారించి చర్యలు తీసుకుంటాం. నకిలీ మొక్కలను ఇస్తున్నారని ఎవరైనా రైతులు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- గౌసియామీ, ఉద్యానశాఖాధికారి

అవిశ్వాసానికి సై

మడకశిర చైర్‌పర్సన్‌పై 13మంది తీర్మానం
కలెక్టర్‌కు సమర్పణ



కలెక్టర్‌కు అవిశ్వాసం పెడుతున్నట్లు వినతి సమర్పిస్తున్న కౌన్సిలర్లు

మడకశిర టౌన్/పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సర్వం సిద్ధమైంది. మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా.. బుధవారం 13 మంది ప్రస్తుత చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మపై అవిశ్వాస తీర్మానానికి సై అన్నారు. ఆ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ చేతన్‌ను ఆయన చాంబర్‌లో కలిసి, కౌన్సిలర్లు తీర్మాన పత్రాలు సమర్పించారు. మడకశిర నగర పంచాయతీలో మొత్తం 20 వార్డులు ఉండగా.. ఐదుగురు టీడీపీ కౌన్సిలర్లు గెలుపొందారు. వైసీపీకి చెందిన 8 మంది కౌన్సిలర్లు.. అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారు. వీరిలో పలువురు ఇప్పటికే టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు కూడా. దీంతో టీడీపీ బలం 13కి చేరింది. ఈ నేపథ్యంలో వారి సంతకాలతో కూడిన పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న ఐదో వార్డు కౌన్సిలర్ ప్రియాంక, 2వవార్డు సభ్యుడు సుధాకర్ నాయక్, 6వ వార్డు కౌన్సిలర్ పార్వతమ్మ, 13వ వార్డు సుజాతమ్మ, 14వ వార్డు వెంకటలక్ష్మమ్మ, 17వవార్డు సుభద్ర, 18వ వార్డు సావిత్రమ్మ తదితరులు అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి తీర్మానాన్ని సమర్పించారు. దీంతో మడకశిర నగర పంచాయతీ పీఠంపై ఎవరు ఆశీనులవుతారన్న చర్చ సాగుతోంది. టీడీపీ తరఫున గెలుపొందిన వారికే అవకాశం ఇవ్వాలనుకుంటే 15వ వార్డు కౌన్సిలర్ నరసింహరాజు పీఠం ఎక్కడం ఖాయం. నగర పంచాయతీ ఎస్సీ జనరల్‌కు కేటాయించడంతో టీడీపీ తరఫున ఆ వర్గం నుంచి ఆయన మాత్రమే విజయం సాధించారు. దీంతో నరసింహరాజుకు పీఠం ఖరారు అన్న ప్రచారం సాగుతోంది. వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారిలో ఇద్దరు ఆ వర్గానికి చెందిన వారు ఉండడంతో వారు పీఠంపై ఆశలు పెట్టుకున్నారని తెలుస్తోంది. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కౌన్సిలర్లు నరసింహరాజు, ఉమాశంకర్, శ్రీనివాసులు, సుధాకర్ నాయక్, నాగేంద్ర, లక్ష్మయ్య ఉన్నారు.

మెడికల్ వెరిఫికేషన్ కోసం రూ.వెయ్యి చెల్లించాలి

అనంతపురం విద్య, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీల నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా మెడికల్ వెరిఫికేషన్‌కు వచ్చే టీచర్లు డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు ఆస్పత్రికి రూ.1000 చెల్లించాలని డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. మెడికల్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే టీచర్లు ఈవిషయాన్ని గమనించాలన్నారు. గురువారం అనంతపురం, 25న శ్రీసత్యసాయి జిల్లాల టీచర్లు, ఈ తేదీల్లో గైర్హాజరైన రెండు జిల్లాల టీచర్లు 26వ తేదీన హాజరుకావచ్చునని పేర్కొన్నారు.

మార్పులపై అవగాహన పెంచుకోవాలి: ఆర్టీసీ ఆర్‌ఎం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు ఎప్పటికప్పుడు అధునాతన సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ పేర్కొన్నారు. ఆర్‌ఎం కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం బ్రేక్ సిస్టమ్ మెయింటెనెన్స్‌పై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. బ్రేకింగ్ సిస్టమ్‌లో ఆధునిక టెక్నాలజీ అయిన ఏబీఎస్(యాంటి లాక్ బ్రేక్ సిస్టమ్), ఈఎస్‌పీ(ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్)ల గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఏళ్లు గడిచినా..!

నిధులు లేక నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాలు

అద్దె భవనాల్లో కేంద్రాల నిర్వహణ
ఇబ్బంది పడుతున్న సిబ్బంది, లబ్ధిదారులు



కూడేరులో పాఠశాల వరండాలో అంగన్‌వాడీ కేంద్రం

కూడేరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నాడు- నేడు పథకం కింద మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాలు నిధులు లేక నిలిచి పోయాయి. దీంతో కొన్ని కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా 48 అంగన్‌వాడీ కేంద్రాల్లో 43 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మిగిలినవి అంగన్‌వాడీ కేంద్రాలు. ఆయా కేంద్రాల పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం గర్భిణులు 254 మంది, బాలింతలు 241మంది, 6 నెలలోపు చిన్నారులు 242మంది, ప్రీ స్కూల్ 2472 మంది ఉన్నారు. గత కొన్నేళ్లుగా 13 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వైసీపీ పాలనలో నాడు- నేడు రెండో దశ కింద ఐదు అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేశారు. ఒక్కో భవన నిర్మాణానికి ప్రభుత్వం దాదాపు రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో ఇప్పేరు, పి. నాగిరెడ్డిపల్లి, మరుట్ల- 2 కాలనీ, ఉదిరిపికొండ, అరవకూరు గ్రామాలకు నూతన భవనాలను మంజూరు చేశారు.

- **నిధులు సక్రమంగా రాక**

వైసీపీ పాలనలో మంజూరైన అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను అప్పట్లో ఇంజనీరింగ్ సిబ్బంది పట్టించుకోలేదు. పనుల సమయంలో అందుబాటులో ఉండకపోవడంతో ఆ భారం అంగన్‌వాడీలపైనే పడింది. దీంతో నిధులు సక్రమంగా రాక పోవడం, వచ్చిన అరకొర నిధులతో పనులు చేశారు. తిరిగి నిధులు విడుదల చేయకపోవడంతో భవన నిర్మాణం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. తర్వాత భవన నిర్మాణ పనులను ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీలు, తల్లుల కమిటికి అప్పగించారు. ఎన్నికలు రావడంతో నిధులు విడుదల మరింత ఆలస్యమైయింది. దీంతో భవన నిర్మాణం కోసం నిల్వ చేసిన సిమెంట్ కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గడ్డ కట్టి పనికి రాకుండాపోయింది. నిల్వ చేసిన ఇసుక సైతం వర్షాలకు కొట్టుకుపోయింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా పనులను పట్టించుకోకపోవడంతో ఆయా పరిధిలో ఉన్న గ్రామీణులు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు.

- **పాఠశాల వరండాలో ...**

మండల కేంద్రంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రం ప్రస్తుతం పాఠశాల వరండాల్లో కొనసాగుతోంది. సొంత భవనం దెబ్బతినడంతో అద్దె భవనాలు దొరక్క సెంటర్ నడపడానికి అంగన్‌వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల వరండాలో విధులు కొనసాగిస్తుండటంతో వానాకాలం లో వర్షాలకు వరండాలో ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. సొంత భవనం నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించారని, ప్రభుత్వం తక్షణం భవనం మంజూరు చేయాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరుతున్నారు.



పి. నాగిరెడ్డిపల్లి గ్రామంలో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం: శ్రీదేవి, సీడీపీఓ



మండలంలో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటి వరకు ఇప్పేరు, మరుట్ల, పి. నాగిరెడ్డిపల్లి, ఉదిరిపికొండ, అరవకూరు గ్రామాల్లో టాప్ లెవెల్ వరకు నిర్మాణ పనులు జరిగాయి. నిధులు రాక పోవడంతో పనులు నిలిచిపోయాయి. భవనాల పనులు పూర్తి కావడానికి అవసమైన నిధులు కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

శ్రీ సత్యసాయిబాబా (వర్ధంతి)



ఇరవయ్యో శతాబ్దంలో పేరొందిన ఆధ్యాత్మికగురువుగా, వేదాంతిగా, భగవంతుడి అవతారంగా విశ్వసించబడే సత్యసాయి బాబా 1926 నవంబరు 23న పుట్టపర్తిలో జన్మించారు. అసలు పేరు సత్యనారాయణ రాజు. ప్రపంచవ్యాప్తంగా 166 దేశాలలో 10వేల సత్యసాయి సేవా సంస్థలు ఉన్నాయి. సత్యసాయి విద్యాసంస్థ దేశంలో నాక్‌చే ఏ++ రేటింగ్ పొందిన ఒకే ఒక సంస్థ. కాగా 220 పడకలతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉంది. సంస్థల ఆధ్వర్యంలో విద్య, సేవా కార్యక్రమాలు సాగుతున్నాయి. 2011 ఏప్రిల్ 24న నిర్యాణం చెందారు.

నండూరి రామమోహనరావు (జయంతి)



'ఆంధ్రజ్యోతి' పత్రికకు సుదీర్ఘ కాలం సంపాదక బాధ్యతలు వహించిన నండూరి రామమోహనరావు 1927 ఏప్రిల్ 24న కృష్ణా జిల్లా బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామంలో జన్మించారు. తెలుగు పాత్రికేయుడిగానే కాక రచయితగా కూడా గుర్తింపు పొందారు. సామాన్యులకు సైన్సు సంగతులు పరిచయం చేయడంలో వీరి కృషి అపారం. మిత్రలాభం, మిత్రభేదం (పంచతంత్ర కథలు) పేరిట బాపు వేసిన బొమ్మలకు నండూరి మాటలు అందించారు. తెలుగు యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్, ఇంకా ఉత్తమ జర్నలిస్టు అవార్డు, మద్రాసు తెలుగు అకాడమీచే 'ఉగాది వెలుగు', కళాసాగర్, శిరోమణి తదితర అవార్డులు పొందారు. 2011 సెప్టెంబరు 2న కన్నుమూశారు.

డాక్టర్ రాజ్‌కుమార్ (జయంతి)



కన్నడ కంఠీరవుడు, పద్మభూషణ్ గ్రహీత డాక్టర్ రాజ్‌కుమార్ 1929 ఏప్రిల్ 24న గాజనూరు ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు సింగనల్లూరు పుటస్వామయ్య ముత్తురాజు. కన్నడ సినీ రంగానికి వన్నె తేవడమే కాక కన్నడ భాషకోసం ఎంతో పాటుపడ్డారు. శాండల్‌వుడ్‌లో కల్చరల్ ఐకాన్‌గా నిలిచారు. 'అణ్ణావ్ర' (అన్నగారు) అని అభిమానులచే పిలవబడ్డారు. బంగారద మనుష్య, కస్తూరి నివాస, గంధద గుడి, జీవన చైత్ర వంటి సినిమాలు హిట్‌గా నిలిచాయి. 50ఏళ్లలో 200 సినిమాలలో నటించారు. వర నట, గానగంధర్వ, రసికరాజా, రాజన్నగా పేరొందారు. తన పాటలు తానే పాడుకున్న నటుడు. నేపథ్య గాయకుడిగా ఇతర నటులకు గాత్రదానం చేశారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, ఎన్టీఆర్ అవార్డు ఇతర పురస్కారాలు పొందారు. 76వ యేట 2006 ఏప్రిల్ 12న కన్నుమూశారు.

ఏడిద నాగేశ్వరరావు (జయంతి)



తెలుగు సినీ రంగంలో పేరొందిన నిర్మాత ఏడిద నాగేశ్వరరావు 1934 ఏప్రిల్ 24న తూర్పు గోదావరి జిల్లా కొత్తపేటలో జన్మించారు. పూర్ణోదయ మూవీ క్రియేషన్స్ సంస్థ అధినేత. డ్రామా నటుడిగా కెరీర్ ప్రారంభించి వెండితెరపై నటుడిగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా తదుపరి సినీ నిర్మాణరంగంలో అడుగుపెట్టారు. శంకరాభరణం, స్వయంకృషి, స్వాతి ముత్యం, తదితర క్లాసికల్ టచ్‌తో కూడిన సినిమాలు నంది అవార్డులు, నేషనల్ అవార్డులు సాధించడంతోపాటు ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ప్రదర్శించబడ్డాయి. నంది అవార్డుల కమిటీ ఛైర్మన్‌గా, నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. 2015 అక్టోబరు 4న కన్నుమూశారు.

సచిన్ టెండూల్కర్ (పుట్టినరోజు)



అభిమానులచే 'క్రికెట్ దేవుడి'గా, లిటిల్ మాస్టర్‌గా పిలవబడే సచిన్ రమేశ్ టెండూల్కర్ 1973 ఏప్రిల్ 24న బాంబేలో జన్మించారు. గొప్ప బ్యాట్స్‌మన్‌గా క్రికెట్ చరిత్రలో ఒక చరిత్ర సృష్టించారు. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో వంద సెంచరీలు చేసిన ఏకైక క్రీడాకారుడు. వన్డేలలోనూ తొలిసారి డబుల్ సెంచరీ చేశారు. టెస్టు మ్యాచులు, వన్డేలలోనూ 30వేల పరుగులు మైలురాయిని అధిగమించారు. పద్మశ్రీ, పద్మ భూషణతోపాటు పిన్నవయస్సులోనే 'భారతరత్న' అందుకున్న ఏకైక క్రీడాకారుడు. రాజ్యసభకు నామినేట్ అయ్యారు. పలు గౌరవ పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. ఆయన ఆటో బయోగ్రఫీ 'ప్లేయింగ్ ఇట్ మై వే' లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌చే 'గ్రూప్ కేప్టెన్' గౌరవ హోదా దక్కించుకున్న తొలి క్రీడాకారుడు. 2025 బీసీసీఐ అవార్డులలో సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు పొందారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోండి

కంప్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఉచిత ఆరోగ్య శిబిరాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జీపీ ఉప కార్యదర్శి భీమప్ప కోరారు. నరేగా కూలీలు తమ పనిపై ఎక్కువ దృష్టి పెట్టడంతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధచూపాలన్నారు. బుధవారం వ్యసనకెరె గ్రామంలోని కేరే అంగల్‌లో నరేగా కూలీలకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షల శిబిరంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 300 మంది కార్మికులను పరీక్షలు చేశారు.

రాజస్థాన్ కుండలకు పెరిగిన డిమాండ్

బళ్లారిరూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు రాజస్థాన్ కుండలపై ఆసక్తి చూపుతున్నారు. సరైన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఫ్రిజ్‌లో నీరు తాగే కన్నా కుండలోని నీరు తాగితే మంచిదని అంటున్నారు. గత సంవత్సరంలో ఒక కుండ ధర రూ.400 నుంచి రూ.500 ఉండగా, ప్రస్తుతం రూ.600 నుంచి 700 వరకు పలుకుతున్నాయి.



కుండను కొనుగోలు చేస్తున్న వ్యక్తి

కశ్మీర్ ఘటనపై పెల్లుబికిన నిరసన

» వివిధ సంఘాలు, పార్టీలచే కొవ్వొత్తులతో ర్యాలీలు



బాగేపల్లిలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

బాగేపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసిన సంఘటనను ఖండిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంయుక్తంగా బుధవారం నిరసన తెలిపాయి. విద్యార్థులు పట్టణంలోని బస్టాండ్ జీవీ శ్రీరామరెడ్డి విగ్రహం వద్ద నిరసన తెలిపారు. తొలుత సుందరయ్య భవనం నుంచి ర్యాలీగా డీవీజీ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల ఆగడాలకు అడ్డుకట్ట వేయలేని కేంద్ర బీజేపీ ప్రభుత్వ వైఫల్యాన్ని ఖండించారు. డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు సురేశ్ మదకరి మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో కర్ణాటకకు చెందిన ఇద్దరు సహా 28మంది బలయ్యారని విచారం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల పైశాచిక చర్యను ఖండిస్తున్నట్టు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సోమశేఖర మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. హింసతో జాతీయ సమైక్యతను, సామరస్యాన్ని దెబ్బ తీయలేరన్నారు. కర్ణాటక ప్రాంత రైతుసంఘం జిల్లా సహసంచాలకులు డీటీ మునిస్వామి, చన్నరాయప్ప, రఘురామరెడ్డి, దళితహక్కుల సమితి తాలూకా కార్యదర్శి కృష్ణప్ప, రఫీక్, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

మహదేవపుర: కశ్మీర్ ఉగ్రవాద ఘటనను ఖండిస్తూ ఏఈసీఎస్ లే అవుట్ వార్డు కుందలహళ్ళి కాలనీలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు. నియోజకవర్గ బీజేపీ రూరల్ అధ్యక్షుడు హూడి పిళ్ళప్ప మాట్లాడుతూ అమాయకులపై ఉగ్రవాదులు దాడి చేసి పొట్టన పెట్టుకున్నారని విచారం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందినవారి కుటుంబాలకు అండగా ప్రతి ఒక్కరూ నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ర్యాలీలో హూడి వార్డు అధ్యక్షుడు పవన్‌రెడ్డి, ముఖ్యులు పవన్‌శెట్టి, శ్రీనివాస్, విజయ్‌గౌడ, మహేశ్, బాబురెడ్డి, శ్రీనివాస్‌రాజు, కృష్ణమూర్తి, చంపాకళా తదితరులు పాల్గొన్నారు.

ఆనేకల్‌లో...

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకా బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో కేంద్రమాజీ మంత్రి ఏ నారాయణస్వామి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దేవరకొండప్ప సర్కిల్‌లో బుధవారం రాత్రి భారీ ర్యాలీ చేపట్టారు. ఉగ్రవాద నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యంగారెడ్డి, నరసింహారెడ్డి, శంకర్, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.



కుందలహళ్ళి కాలనీలో కొవ్వొత్తుల ర్యాలీ



ఆనేకల్‌లో ర్యాలీలో కేంద్ర మాజీ మంత్రి నారాయణస్వామి

ప్రైవేట్ బస్సు, క్యాంటర్ ఢీ.. పలువురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు ఇవే

చింతామణి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చింతామణి ఉప విభాగం శిడ్లఘట్ట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హెచ్‌క్రాస్ సమీపాన కుంబిగానహళ్ళి గేట్ వద్ద ప్రైవేట్‌బస్సు, క్యాంటర్‌లు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో పలువురు గాయపడ్డారు. బుధవారం ఉదయం చోటు చేసుకున్న ఘటనలో ట్యాంకర్ డ్రైవర్, బస్సు డ్రైవర్, బస్సులోని ఏడుగురు ప్రయాణీకులు గాయపడ్డారు. క్యాంటర్ డ్రైవర్ ఇమాన్‌కుమార్ తలకు తీవ్రగాయాలు కావడంతో బెంగళూరు నిమ్హాన్స్ ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ కాలికి తీవ్ర గాయాలు కావడంతో బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ప్రయాణీకులలో నలుగురిని హొస్కోట సిలికాన్ ఆసుపత్రిలోనూ మరో ముగ్గురిని హొస్కోట శ్రీనివాస్ ఆసుపత్రిలో చేర్పించారు. విజయపురవైపు వెళ్తున్న ఎంఎం బస్సును, సిమెంట్ ఇటుకలతో వెళ్తున్న క్యాంటర్ వాహనం ఢీ కొంది. వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రమాదంపై శిడ్లఘట్ట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గాయాలతో చికిత్స పొందుతున్న వారి వివరాలు తెలియరాలేదని డీఎస్పీ మురళీధర్ తెలిపారు.

వైభవంగా మునేశ్వరస్వామి రథోత్సవం

మహదేవపుర, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అవలహళ్ళిలో పురాతనమైన మునేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలలో భాగంగా స్వామివారి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. మాజీ మంత్రి అరవింద లింబావళి లాంఛనంగా ప్రారంభించారు. తొలుత మూల విరాట్టుకు విశేషపూజలు, అలంకరణలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని అలంకరించిన రథంపై కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించారు. రథోత్సవంలో డొళ్ళుకుణిత, గారడీబొమ్మలు, తదితర కళాకారుల బృందం నృత్యాలు అలరించాయి. వీరేనహళ్ళి, బిదరె అగ్రహార, చీమసంద్ర, హిరండహళ్ళి, మేడహళ్ళి, మండూరు, బండాపుర తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక బీజేపీ నాయకులు హూడి పిళ్లప్ప, రాంపుర గణేశ్, కెంపేగౌడ, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మునేశ్వరస్వామికి అలంకరణ, మాజీ మంత్రి అరవింద లింబావళి తదితరులు

ఇస్కాన్‌లో ఘనంగా తెప్పోత్సవం

బెంగళూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇస్కాన్ మందిరంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాధాకృష్ణులను తెప్పోత్సవంలో ఊరేగించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ఆలయంలోని పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. చైత్రమాసంలో పూర్వాషాఢ నక్షత్రం వేళ ఇలా ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాజాజినగర్ ఇస్కాన్ ఆలయంలో ఎటుచూసినా సందడి నెలకొంది. తెప్పోత్సవం సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో, విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు.



రాధాకృష్ణుల తెప్పోత్సవంలో భక్తుల సందడి

చట్టాలపై మహిళలకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, అధికారులు

తోరణగల్లు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా జోగా గ్రామంలో జిల్లా, తాలుకా పంచాయతీ వీరభద్రేశ్వర సంజీవిని గ్రామ పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ భూ దినోత్సవం సందర్భంగా సంఘాలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కానూన్ సేవ ప్రాధికార సభ్యులు కార్యదర్శి రాజేష్ హోసమనే, సండూరు తాలుకా జేఎంఎఫ్‌సీ దేవరెడ్డి, ఉపన్యాసకులు జి మల్లికార్జున మాట్లాడుతూ భూమిదినం శుభాకాంక్షలు తెలుపుతూ మహిళల పిల్లలకు అనేక చట్టాల గురించి వివరించారు. శిశు అభివృద్ధి యోజన అధికారి లాల్‌సాబ్ తాలుకా వకీల్ సంఘం అధ్యక్షులు అరలి మల్లప్ప, తోరణగల్లు ఎస్ఐ డాకేష్, అధికారులు గీతాలక్ష్మీ, సోమశేఖర్, స్వయం సేవక్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై యూత్ కాంగ్రెస్ నిరసన

రాయచూరు ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్ రాష్ట్రం పహల్గామ్‌లో పర్యాటకుల పై జరిగిన ఉగ్రదాడిని యూత్ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. దాడిని నిరసిస్తూ బుధవారం నగరంలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద ర్యాలీ చేపట్టారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నేత ఫజల్ ఖాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, భద్రత వైఫల్యం వల్లే 26 మంది మృత్యువాతపడ్డారన్నారు. జమ్ము-కశ్మీర్ పునరావాస బిల్లు 370 రద్దు వల్ల శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని ఘర్షణ వాతావరణం లేదంటూ కేంద్రం చేస్తున్న ప్రకటనలు బూటకమని దాడితో మరోసారి తేటతెల్లమైందన్నారు. దాడిలో చనిపోయిన వారి కుటంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.



అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ఉగ్రవాదాన్ని అంతమొందించే శక్తి భారత్‌కు ఉంది

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర

రాయచూరు ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తుదముట్టించే శక్తి భారత్‌కు ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర అన్నారు. పహల్గామ్‌లో 28 మంది యాత్రికులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించేందుకు భారత ప్రభుత్వం ఇప్పటికే సిద్ధమైందన్నారు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ పార్టీ చేపట్టిన జనాక్రోశ యాత్రను రేపు, ఎల్లుండి రెండు రోజులు వాయిదా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జనాక్రోశ యాత్ర పేరుతో బుధవారం రాయచూరులోని టిప్పుసుల్తాన్ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలి వద్ద ఆయన మాట్లాడారు. ఉత్సాహంగా సభకు వచ్చిన ప్రజలకు అభివాదాలు తెలిపిన విజయేంద్ర, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు తమ పార్టీ ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఉగ్రవాదుల మారణహోమం జరిగిన వెంటనే ప్రధాని విదేశీ పర్యటన నుంచి తిగిరి వచ్చారని, హోం మంత్రి అమిత్‌షా వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఉగ్రవాదులకు అండగా ఉన్న వారిపై భారత ప్రభుత్వం ఉపేక్షించేది లేదన్నారు. ప్రధాని మోదీ అధ్యక్షతన పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సర్వశక్తులు ఉన్నాయని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర

కార్మికులకు ఉచిత వైద్యశిబిరం



శిబిరంలో పరీక్షల నిర్వహణ

శిడ్లఘట్ట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్యారగాన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో కట్టడ, ఇతర కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో నమోదు చేసుకున్న కార్మికులకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, కిడ్నీ, లివర్, థైరాయిడ్ తదితర పరీక్షలు చేశారు. శిబిరం నిర్వాహకులైన మల్లికార్జున్ పట్టిదార్ మాట్లాడుతూ నిత్యం శ్రమించే కార్మికులు ఆసుపత్రికి వెళ్లేందుకు వెనుకంజ వేస్తారన్నారు. ఎటువంటి పరీక్షలు కూడా చేయించుకునేందుకు ఆసక్తి చూపరన్నారు. కార్మికుల ఆరోగ్యమే లక్ష్యంగా శిబిరం ఏర్పాటు చేశామని, ఒకవేళ పరీక్షల్లో ఏమైనా సమస్యలు గుర్తిస్తే ముందస్తు చర్యలతో ఆరోగ్యాన్ని బాగు చేసుకోవచ్చునన్నారు. శిబిరంలో వైద్యులు అబూబకర్ సిద్దికి బృందం పరీక్షలు చేశారు. కార్యక్రమంలో తాలూకా వడ్రంగి కార్మికుల సంఘం అధ్యక్షుడు ప్రదీప్ దీపు, సంఘం పదాధికారులు మహ్మద్ యూసుఫ్, బాబు, ప్రభాకర్‌బాబు, యాసీన్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

26న అంబేడ్కర్ జయంతి

బెంగళూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బెంగళూరు తెలుగు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో భారతరత్న బబాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి జరగనుంది. పూర్వ విద్యార్థులు పీవీ తిరుపతి (రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్, అటామిక్ ఎనర్జీ), శ్రీధర్ (రిటైర్డు అసిస్టెంట్ కమిషనర్, సెంట్రల్ ఎక్సైజ్), వీ కేశవులు (రిటైర్డు డీజీఎం, కెనరా బ్యాంక్), మాతరాజు వై దాసు డి తిరుతపయ్య (రిటైర్డ్ ఏజీఎం, ఎస్‌బిఐ), పి రాజేశ్, డేవిడ్‌రాజు, సుబ్రమణి, లక్ష్మణ్, బాలకృష్ణ, డి గోపాలకృష్ణ, ఎం బాబు తదితరులు కార్యవర్గ సభ్యులుగా ఏర్పడి బెంగళూరు హలసూరు ట్యాంక్‌బండ్ సమీపాన యాదవసంఘంలో ఉదయం 10 గంటల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ప్రకటనలో తెలిపారు. ఐటీఐ రిటైర్డు అధికారి వీ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించనుండగా సాంఘిక సంక్షేమ శాఖ సలహాదారులుగా వ్యవహరిస్తున్న రిటైర్డు ఐఏఎస్ డాక్టర్ వెంకటయ్య ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు.

సమస్యలు పరిష్కరించాలని లోకాయుక్తకు ఫిర్యాదు



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న లోకాయుక్త అధికారులు

రాయచూరు ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పలువురు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఎస్పీ సతీశ్ ఆధ్వర్యంలో బుధవారం మహానగర పాలిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న గ్రామీణ ప్రాంత నాయకులు, ప్రజాప్రతినిధులు సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా 2013-14లో చేపట్టిన నియామకాలకు సంబంధించి ఇప్పటివరకు పేర్లు నమోదు కాలేదని, దీంతోపాటు సంబంధిత శా ఖలో అనేక ఖాళీలు ఉన్నాయని వాటిని భర్తీ చేయాలని కోరారు. వివిధ గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మత్తులు చేపట్టాలన్నారు.

డ్రైనేజీల పూడికతీతకు ఆదేశం



అక్రమ దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

రాయచూరు ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నగరంలో చెత్తచదారం పేరుకుపోయి మూసుకుపోయిన డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేయాలని మహానగర పాలిక కమిషనర్ జుబిన్ మొహపాత్ర ఆదేశించారు. వార్డుల వారిగా స్వచ్ఛత పనులపై సమీక్షలు నిర్వహిస్తున్న కమిషనర్, బుధవారం పలు వార్డుల్లో క్షేత్ర స్థాయి పరిశీలనలు జరిపి సమస్యను స్వయంగా పరిశీలించారు.

రోడ్లపై వరిధాన్యం.. రాకపోకలకు అంతరాయం

కంప్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోకి ఎమ్మిగనూరు, రాంసాగర్, మన్నూరు, సూగూరు, జానూరు, దేవసముద్రం తదితర గ్రామాల్లో రైతులు కోసిన వరిధాన్యాన్ని రోడ్లపై ఆరబోయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వరి ధాన్యం ఆరబోయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినా రైతులు మాత్రం వరిధాన్యం అమ్మకాలు అయితే చాలని మిన్నకుండిపోతున్నారు. పొలాల్లో ఉండాల్సినవున్న ధాన్యాన్ని రోడ్లపైనే వేసుకుని అమ్మకాలు చేపడుతున్నారు. ఇప్పటికైనా రైతులు స్పందించి రోడ్లపై వరిధాన్యాన్ని ఆరబోయవద్దని వాహనదారులు కోరుతున్నారు.



రాంసాగర్ వద్ద రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.35	1,578.52
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	400	177
నీటి నిల్వ (టీఎంసీలు)	6.91	3.80

రైల్వే అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



హుబ్లీ డీఆర్ఎంకు వినతిపత్రం ఇస్తున్న వినియోగదారుల సలహా కమిటీ సభ్యులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బళ్లారి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని నైరుతి రైల్వే విభాగం వినియోగదారుల సలహా సమితి సభ్యులు ఆర్ గోపాలకృష్ణ, గిరిధర్ హుబ్లీ డీఆర్ఎం బేల మీనాకు విన్నవించారు. వారు మాట్లాడుతూ బళ్లారి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు తొందరగా పూర్తి చేయాలని, రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలన్నారు. వందే భారత్ రైలును ప్రారంభించాలని డీఆర్ఎంకు వినతి పత్రం సమర్పించారు.

వీరశైవ కళాశాల అధ్యక్షుడిగా సతీష్ బాబు



సతీష్‌బాబుని సన్మానిస్తున్న సంఘం పదాధికారులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీరశైవ కళాశాల అధ్యక్షుడిగా సతీష్ బాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సతీష్‌బాబు రెండోసారి అధ్యక్షులు బాధ్యతలు చేపట్టడంతో ఆ సముదాయ కుల బాంధవులు ఆయనను ఘనంగా సన్మానించారు. వీరభద్ర గౌడ, కొర్రి సురేష్, అక్కి శివరాజు, బండేగౌడ, ప్రిన్సిపాల్ గౌతమ్, గోనాళ్ మంజునాథ్, మహేష్ కట్టే గౌడ, పాలిష్ గౌడ, పంపాపతి, మొద్దనగౌడ, వీరశైవ కాలేజ్ పలువురు పదాధికారులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

భారీ వాహనాలపై ఆంక్షలు విధించండి



కొడల్ గ్రామంలో నుంచి వెళుతున్న భారీ వాహనాలు

కంప్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తోరణగల్లు పరిధిలోని కోడలు గ్రామంలో కొన్నేళ్లుగా నిత్యం రాకపోకలు సాగిస్తున్న భారీ లారీల వల్ల ప్రజలు, పశువులు ప్రాణ భయంతో నడవాల్సి వస్తోంది. సంబంధిత శాఖ అధికారులను లారీల రాకపోకలను నిషేధించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. దీనిపై గ్రామంలోని రవి నాగ రాజు పరమేష్, సురేష్ అంతాపూర్ గ్రామ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా భారీ వాహనాలను గ్రామంలోకి రాకుండా చేయాలని వారు కోరుతున్నారు.

కూలీలకు బీమా



కూలీలకు బీమా చేయిస్తున్న బ్యాంకు అధికారులు

తోరణగల్లు, ఏప్రిల్ 23(ఆంధ్ర జ్యోతి): సండూరు తాలుకా దరోజీ గ్రామ పంచాయతీలో బుధవారం జిల్లా మార్గదర్శి బ్యాంకు, కర్ణాటక బ్యాంకు, హోసదరోజీ గ్రామ పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో నరేగా యోజన కార్మికులకు పీఎంజే బీవైఆర్ఎస్ 436, పీఎంబీఎస్‌వై రూ. 20 లకు ఇన్సురెన్స్ కార్యక్రమం నిర్వహించారు. మార్గదర్శి బ్యాంకు అధికారి గిరీష్ కులకర్ణి, దరోజీ కర్ణాటక బ్యాంకు అధికారి ఆంజనేయ, ఉపన్యాసకులు దినేష్, రమేష్, అధికారులు కల్లప్ప, ఎంకప్ప పంచాయతీ డీఈవో రఘునాథ్, మంజుళ, సిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధ జలం సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలి

జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి త్రిలోక చంద్ర

బళ్లారి సిటీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల్లో వేసవిలో శుద్ధి చేసిన నీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి డాక్టర్ త్రిలోకచంద్ర అధికారులకు సూచించారు. నగరంలోని జిల్లా పంచాయతీ హాల్లో బుధవారం నిర్వహించిన కర్ణాటక అభివృద్ధి కార్యక్రమ ప్రగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నీటి వనరులను తనిఖీ చేయాలని, ఓహెచ్‌టీని శుభ్రం చేయాలని, తాగునీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకూడదన్నారు. ఎట్టి పరిస్థితిల్లోనూ కలుషిత నీటిని సరఫరా చేయరాదని ఆదేశించారు. నీటి నమూనాలను పరీక్షించిన తర్వాతే సరఫరా చేయాలని ఓవర్‌హెడ్ ట్యాంకుల మూతలు మూసి ఉండేలా చేసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 82 గ్రామాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగే అవకాశముందని గుర్తించామన్నారు. తాగునీటి సరఫరా కోసం ఇప్పటికే ట్యాంకర్లను సిద్ధంగా ఉంచామని, గ్రామీణ తాగునీటి సరఫరా పారిశుధ్య విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇందూధర్ అన్నారు. జనసామర్థ్యం ఎక్కువగా ఉన్న ప్రదేశాలు, జాతరలోట స్వచ్ఛమైన తాగునీటి వినియోగం గురించి అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో అత్యవసర ఆరోగ్యసేవల కోసం వచ్చే రోగులు ప్రతిసారీ జిల్లా కేంద్రాలకు వెళ్లాలని సిఫారసు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజలు ఉన్న చోటే ఆరోగ్య సేవలు అందించాలన్నారు. దీని కోసం తగినంత మానవ వనరులను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని పశువులకు మేత కొరత ఉండకూడదన్నారు. ప్రస్తుతం అన్ని పశుగ్రాస బ్యాంకులలో గడ్డి నిల్వలను ఉంచాలని ఆయన సూచించారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, షెడ్యూల్డ్ తరగతుల సంక్షేమం, మైనార్టీ శాఖల అధికారుల నుంచి హాస్టళ్ల నిర్మాణం, నిర్వహణ, తాగునీరు, మరుగుదోడ్ల వ్యవస్థ ఇతర ఏర్పాట్లకు సంబంధించి సమాచారాన్ని సేకరించి తగిన సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహమ్మద్ హారీస్, అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్, జిల్లా మినరల్ ఫౌండేషన్ ప్రత్యేక అధికారి మంజునాథ్, పంచాయతీ డిప్యూటీ సెక్రటరీ గిరిజా శంకర్, జిల్లా తాలూకా స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్రిలోకచంద్ర

రోగులను ప్రైవేటు ఆస్పత్రులకు పొమ్మనడం సమంజసమా?

- లోకాయుక్త ఎదుట యువకుడి వాగ్వాదం

సిరుగుప్ప, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగుల‌ను ప్రైవేటు క్లీనిక్‌లకు వెళ్లాలని వైద్యులు చెప్పడం హాస్యాస్పదంగా వుందని యువకుడు లోకాయుక్త అధికారులతో వాగ్వాదానికి దిగారు. బుధవారం పట్టణంలోని శిశు అభివృద్ధి యోజన కార్యాలయాన్ని లోకాయుక్త అధికారులు సందర్శించారు. తాలుకా ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలతో లంచాలు తీసుకోవడం ఇవ్వడం నేరమన్నారు. చట్టపరిధిలో ప్రజల పనులు చేయాలని అధికారులకు సూచించారు. నగరసభ కౌన్సిలర్ మోహన్‌రెడ్డి వేళకు బస్సులు రావడం లేదని, బస్టాప్ ఉన్నచోట కూడా నిలపడం లేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఓ యువకుడు ప్రభుత్వాస్పత్రిలో మౌలిక సదుపాయాలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వైద్యుల సేవలు అంతంత మాత్రంగానే వున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రసవం కోసం వచ్చినవారిని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాలని ప్రభుత్వ వైద్యులు సూచించడం ఎంతవరకు సమంజసమని వాగ్వాదానికి దిగారు. సంబంధిత ప్రభుత్వాస్పత్రి ముఖ్య అధికారి వివేకానంద ఇలాంటి సమస్యలు జరుగకుండా చూసుకుంటానని చెప్పారు. ఈవో పవన్‌కుమార్ దండప్ప, ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుమలేష, పీడబ్ల్యూ ఈఈ చెన్నన్న గౌడ, పంచాయతీ రాజ్ ఏఈ తిప్పేస్వామి పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న లోకాయుక్త ఎస్పీ సిద్ధరాజు

మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహించాలి

- ఏడీసీ మహమ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శంకరాచార్య, భగీరథ, శివశరణు హేమరెడ్డి మల్లమ్మ జయంతి కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖలు ఘనంగా నిర్వహించాలని అదనపు జిల్లా కలెక్టర్ మహమ్మద్ జుబేర్ సూచించారు. శంకరాచార్య, భగీరథ, శివశరణులు హేమారెడ్డి మల్లమ్మ జయంతులను పురస్కరించుకుని నగరంలోని కలెక్టర్ కార్యాలయంలోని కేశ్వాస్ వీడీయో హాల్లో బుధవారం జరిగిన ప్రాథమిక సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మే 2న శంకరాచార్య జయంతి, 5న భగీరథ జయంతి, 10న శివశరణులు హేమారెడ్డి మల్లమ్మ జయంతిని నిర్వహించేందుకు అవసరమైన అన్ని సన్నాహాలు చేయాలని ఆయన ఆదేశించారు. 2న నగరంలోని సంగనకల్లు రోడ్డులోని శృంగేరి శంకరాచార్య మఠం భారతీ తీర్థ సభా భవన్‌లో ఆద్యగురువు శంకరాచార్యుల జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జయంతిలో భాగంగా ఊరేగింపు నిర్వహిస్తామని ఆయన అన్నారు. 5న డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో భగీరథ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి ముందు నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డు మున్సిపల్ కళాశాల మైదానం నుంచి భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. 10న శివశరణులు హేమారెడ్డి మల్లమ్మ జయంతి కార్యక్రమాన్ని అర్థవంతంగా జరుపుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజుతో పాటు వివిధ జిల్లాస్థాయి అధికారులు, సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ జుబేర్

మద్దతు ధరతో జొన్న కొనుగోలు

- ఆహార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సకీనా

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన జొన్న పంటను మద్దతు ధర యోజన కింద రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయనున్నట్లు ఆహార పౌరసరఫరాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సకీనా తెలిపారు. ఈ మేరకు బళ్లారి జిల్లా టాస్క్‌ఫోర్స్ సమితి నిర్ణయించినట్లు తెలిపారు. 2024-25 సంవత్సరానికి మద్దతు ధర పథకం కార్యాచరణను కర్ణాటక రాష్ట్ర సహకార మహా మండలి, బళ్ళారి విభాగం చేపట్టనున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్దతు ధర యోజన కింద రైతులు జొన్న ఉత్పత్తులను అమ్మేందుకు వ్యవసాయ శాఖకు చెందిన ఫ్రూట్స్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్, తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల సహకార సంఘం, ప్రాథమిక వ్యవసాయ పత్తిన సహకార సంఘం, తాలూకా కేంద్ర కార్యాలయాల్లో ప్రారంభించిన కొనగోలు కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. తెల్లజొన్న హైబ్రిడ్ రకానికి క్వింటాల్ రూ.3,371, తెల్లజొన్న మాల్దండి రూ.3,421 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు పేర్లు నమోదుకు మే 31వ తేదీ వరకు అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. బళ్ళారి తాలూకా పరిధిలోని ఏపీఎంసీ ఆవరణం, రూపనగుడి, సిరుగుప్ప పట్టణం, కరూరు, ఉప్పారహోళ్ళి, తాకూరు, హచ్చొళ్ళి, కంప్లి, ఎమ్మిగనూరు, కురుగోడు, సండూరులో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి రైతు ఎకరాకు 20 క్వింటాళ్ల నుంచి గరిష్ఠంగా 150 క్వింటాళ్ల మించకుండా కొనుగోలు చేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం కర్ణాటక రాష్ట్ర సహకార మహా మండలి, బళ్ళారి, లేదా సయ్యద్ వీమ్ పాషా 9449864453 నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు బీఎం సతీష్

సిరుగుప్ప, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహిద్దామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బీఎం సతీష్ పిలుపునిచ్చారు. బుధవారం సిరుగుప్ప పట్టణం ఎన్జీవో భవనంలో 30న బసవేశ్వర జయంతిని నిర్వహించడంపై బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూర్వాపరాల సిద్ధత సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి తాలుకాలోని అన్ని సంఘాల పదాధికారులు, సభ్యులు పాల్గొని చర్చించారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొడ్లి మల్లికార్జున, కురుబ సంఘం అధ్యక్షుడు దమ్మూరు సోమప్ప, చలవాది మహాసభ అధ్యక్షుడు సన్న రామయ్య, భోవి సంఘం అధ్యక్షుడు కాలప్ప, వీరశైవ సమాజం అధ్యక్షుడు చెన్న బసవనగౌడ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల చితాభస్మం సమాధి పరిశీలన



సమాధిని పరిశీలిస్తున్న మంత్రి హెచ్‌కే పాటిల్, రాజవంశస్థులు

బళ్లారి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేయ రాయుల చితాభస్మం సమాధిని పర్యాటక శాఖ మంత్రి హెచ్.కే పాటిల్ పరిశీలించారు. అయన శ్రీకృష్ణదేవరాయుల వంశస్థులతో కలిసి అనేగొంది వద్ద తుంగభద్ర నది మధ్యలో నిర్మించిన రాయల సమాధిని పరిశీలించారు. ఈ ప్రాంతంలో కొందరు వ్యక్తులు గొర్రెలు కోసి మటన్ కుప్పలు వేసి అపవిత్రం చేశారు. దీన్ని కొందరు వ్యక్తులు సామాజిక, ప్రింట్ మీడియాల్లో ప్రచురించారు. దీన్ని చూసి మంత్రి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ గొర్రెలు కోసి మటన్ విక్రయించిన ముగ్గురు స్థానికులపై పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చరిత్రకారులు మనకు గుర్తులు మిగిల్చారని, వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ప్రపంచ పర్యాటక కేంద్రం, పైగా శ్రీకృష్ణదేవరాయులు లాంటి మహోన్నత వ్యక్తుల సమాధులపై ఇలాంటి అకృత్యాలు చేయడం మంచిది కాదని మంత్రి హితువు పలికారు. ఆయనతో పాటు శ్రీకృష్ణదేవరాయుల వంశస్థులు లలితారాణి, రంగదేవ రాయులు, కృష్ణదేవరాయులు, స్థానికులు కాళప్ప, పంచాయతీ అధ్యక్షుడు ఉన్నారు.

జేడీ కార్యాలయాన్ని తరలించొద్దు

- వ్యాపార సంఘాల డిమాండ్



గాంధీభవన్ నుంచి ర్యాలీగా వస్తున్న పలు వ్యాపార సంఘాల నాయకులు

బళ్లారి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలం నుంచి బళ్లారిలో ఉన్న చేనేత, జౌళి శాఖ డైరెక్టర్ కార్యాలయాన్ని కలబుర్గికి మార్చాలనే ప్రభుత్వ ఉద్దేశాన్ని విరమించుకోవాలని వాణిజ్య, పరిశ్రమల మండలి, జిల్లా పతి (కాటన్) సంఘం, టైలరింగ్ అసోసియేషన్, ఇతర వివిధ వ్యాపార సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం ఆయా సంఘాలు పెద్దఎత్తున తరలివచ్చి గాంధీభవన్ నుంచి రాయల్ సర్కిల్(గడిగి చెన్నప్పసర్కిల్) మీదుగా డీ.సీ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం డీసీకి వినతిపత్రం ఇచ్చారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యశ్వంత్‌రాజు, ఇతర వ్యాపారవేత్తలు మాట్లాడారు. బళ్లారిలో బ్రిటీష్ కాలం నుంచి చేనేత, జౌళి శాఖ జాయింట్ డైరక్టరు కార్యాలయం ఉందన్నారు. అలాంటిది ఉన్నపళంగా దాన్ని కలబుర్గికి మార్చలనే ఆలోచనతో కార్యాచరణకు శ్రీకారం చుడుతుండడం బాధాకరం అన్నారు. ఇక్కడ ఒకిన్న దశాబ్దాలుగా ఎన్నో పరిశ్రమలు నడుస్తున్నాయన్నారు. పైగా లక్షలాది మంది శ్రామికులు ఇక్కడ జీవనం సాగిస్తున్నారని, ఆంధ్రలో సరిహద్దులో ఉండడం వల్ల అనేక గ్రామాల ప్రజలు ఇక్కడ గార్మెంట్స్, కాటన్, ఇతర పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్నారన్నారు. కర్ణాటక అసెంబ్లీ బడ్జెట్‌లో కూడా బళ్లారి జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి, వ్యాపార వర్గాలకు, రైతులకు ఏమాత్రం నిధులు కేటాయించలేదని గుర్తు చేశారు.

సమాజాభివృద్ధికి ముందుకు రండి: ఎమ్మెల్యే



వీరేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వాల్మీకి సమాజంలోని ప్రతి ఒక్కరు సమాజ అభివృద్ధికి ముందుకు రావాలని ఎమ్మెల్యే గణేష్ పిలుపునిచ్చారు. పట్టణంలో వాల్మీకి సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కంప్లి తాలుకా వాల్మీకి సమాజం నూతన అధ్యక్షుడిగా జవుకు నీరుగంటి వీరేష్ బాధ్యతలు చేపట్టారు. నూతన అధ్యక్షులు ఎమ్మెల్యే గణేష్‌ను అభినందించి సన్మానించారు. గణేష్ మాట్లాడుతూ త్వరలోనే రూ.6 కోట్ల వ్యయంతో ఎస్టీ హాస్టల్‌కు భూమిపూజ చేస్తామన్నారు. ఇకపై ప్రతి ఇంట్లో విద్యావంతులు వుండాలని ఆకాంక్షించారు. అన్ని సమాజంతో పాటు వాల్మీకి సమాజం కూడా ముందడుగు వేయాలని అన్నారు. నూతన భవనానికి ప్రహరీ కూడా ఏర్పాటు చేసి సమాజంలోని ప్రతి ఒక్కరికి ఏ కార్యక్రమాలైనా నిర్వహించుకునేందుకు ఉపయోగపడేలా చేస్తామన్నారు. వాల్మీకి సమాజం ప్రముఖులు జమ్మన్న, వెంకటేష్ బర్మక్క, రామాంజినేయులు, ఈరన్న, యల్లప్ప, రామాంజిని, లోకేష్ పాల్గొన్నారు.

ఉగ్రదాడి గర్హనీయం



మంజునాథ్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో మంగళవారం పౌరులపై ఉగ్రవాది దాడి గర్హనీయమని ఏఐడీఎస్ఓ జిల్లా కార్యదర్శి కంబలి మంజునాథ్ అన్నారు. ఈవిషయంపై వెంటనే దర్యాప్తు జరిపి నిందితులను చట్టంముందు నిలబెట్టాలని డిమాండ్ చేశారు. దిగిజారిన పెట్టుబడిదారి వ్యవస్థే ఉగ్రదాడికి దారితీస్తోందన్నారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం భూమిపై స్వర్గమైన కాశ్మీర్‌ను చాల కాలంగా నాశనం చేసిన అన్ని రాజకీయ పార్టీలకు సిగ్గుచేటు అని అన్నారు. ఈ విషయంపై వెంటనే దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కమ్మరచేడులో తాగునీటి ఎద్దడి



మూతపడిన వాటర్‌ప్లాంట్

బళ్లారిరూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్ర జ్యోతి): బళ్లారి రూరల్ కమ్మరచేడు గ్రామంలో శుద్ధినీటి ప్లాంటు శిథిలావస్థకు చేరడంతో తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని గ్రామ పంచాయతీ వజీఈ అధ్యక్షుడు అక్కి శివరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా వున్నందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనికి సంబంధించిన ఏజెన్సీకి ఫోన్ చేస్తే వారు టెండర్ ముగిసిందని సమాధానమిచ్చారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి: ఎమ్మెల్యే

రాయచూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలకు సిద్ధం కావాలని రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ అధికారులకు సూచించారు. బుధవారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో తాలూకా స్థాయి త్రైమాసిక కేడీపీ సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే, తాలూకా వ్యాప్తంగా మొత్తం 52 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్నట్లు ఇప్పటికే అధికారులు అంచనా వేసిన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు లేని చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరగాలని, అందుబాటులో ఉన్న ప్రైవేటు బోర్లను వినియోగించుకుని నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. గుంజళ్లిలో ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించాలని ఆదేశించినా నిర్మాణం జరిగిన ట్యాంకులు లేవని, వెంటనే సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

హోసూరు జోన్

మియావాకి అడవికోసం 2.5లక్షల మొక్కలు



పనులకు శ్రీకారం చుట్టిన కలెక్టర్ దినేశ్‌కుమార్

హోసూరు (కృష్ణగిరి), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తొరపల్లి గ్రామంలో సుమారు 45 ఎకరాల విస్తీర్ణంలో మియావాకి అడవిని సృష్టించేందుకు టైటాన్ సంస్థ సిద్ధమైంది. కలెక్టర్ దినేశ్‌కుమార్ లాంఛనంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సంస్థ సీఎస్ఆర్‌లో భాగంగా చక్కటి కార్యక్రమానికి రూపకల్పన చేయడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. పచ్చదనం పెంపుకోసం ప్రభుత్వం బంజరుభూములను పాక్షిక అడవులుగా మార్చేందుకు ప్రముఖ సంస్థలు చేయూత ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్పొరేషన్ పరిధిలో 33 ఎకరాలు, పిల్లనకుప్పం పంచాయతీలో 12 ఎకరాలను మినీ అడవులను సృష్టించేందుకు చేపట్టడం అభినందనీయమన్నారు. జపాన్ దేశ బోటనిస్ట్ అకీరా మియావాకి వేగంగా వృద్ధి చెందే అడవుల పద్ధతిని ప్రవేశపెట్టారని దీంతో ఆయన పేరిట ఈ విధానం పిలవబడుతోందన్నారు. తక్కువ సమయంలో దట్టమైన మొక్కలతో తీర్చిదిద్దడమే ఈ విధానం ప్రత్యేకత అన్నారు. ఇందుకుగాను సౌరశక్తితో నడిచే బోరుబావి, వ్యవసాయ కుంటను రూపొందించనున్నట్టు తెలిపారు. ప్రజల సహకారంతో పచ్చదనం సాధ్యమన్నారు. సబ్ కలెక్టర్ ప్రియాంక, టైటాన్ కంపెనీ ఎండీ వెంకటరమణన్, ఫారెస్ట్ అసిస్టెంట్ కన్సర్వేటర్ అంబుల్కర్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

గుజిరీ గోడౌన్లలో అగ్ని ప్రమాదం.. అపారనష్టం

హోసూరు (క్రైం), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మీదేవినగర్‌లో గుజరీ గోడౌన్లలో బుధవారం ఉదయం అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ప్లాస్టిక్, కాగితం తదితర పాతసామగ్రి నిల్వ చేసే గోడౌన్ల నుంచి వేకువజామున సుమారు 5 గంటలకు పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు సిప్‌కాట్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రెండు ఫైరింజన్లలో వచ్చి మంటలు నియంత్రించారు. అయితే ఈదురుగాలుల కారణంగా మంటలు చెలరేగి అప్పటికే భారీనష్టం సంభవించినట్టు తెలుస్తోంది. మంటలు నియంత్రించడానికి రాయకోట్టై, డెంకణీకోట ప్రాంతాలనుంచి అదనంగా ఫైరింజన్లను రప్పించారు. లక్షలాది రూపాయల నష్టంగా అంచనా వేశారు.



మంటలు ఆర్పుతున్న సిబ్బంది



అడవుల్లోకి ఏనుగులను మళ్లిస్తున్న దృశ్యం

తోటల్లోకి ఏనుగులు... అడవులకు తిప్పి పంపిన అధికారులు

హోసూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అడవులనుంచి దారితప్పి తోటల్లోకి వచ్చిన ఐదు ఏనుగులను గుర్తించిన స్థానికులు అధికారుల సహకారంతో తిప్పి పంపారు. నీరు, ఆహారం కోసం అడవులను వీడి గ్రామాలు, తోటలవైపు ఏనుగులు రావడం సామాన్యం అవుతోంది. ఈ సందర్భంగా ఏనుగులు పంటలను ఎక్కువగా నాశనం చేస్తుంటాయి. తోటలవైపు వచ్చిన ఏనుగులను గుర్తించిన గ్రామస్థులు శానమావు అటవీ ప్రాంతానికి బాణాసంచా కాల్చి మళ్లించారు. ఏనుగుల ఆహారం, దాహార్తి తీర్చేలా అడవులలోనే తాగునీటి ట్యాంకులను ఏర్పాటు చేయాలని రైతులు అంటున్నారు.